# హుస్నాబాద్ అభివృద్ధికి కృషి చేయాలి

## హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజితావెంకన్న



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 12 : హుస్నాబాద్‌కు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న మంత్రిని కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ సహకారంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. జాతీయ స్థాయిలో హుస్నాబాద్‌కు రెండు సార్లు అవార్డులు వచ్చాయని తెలిపారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని, తర్వాత అందరూ కలిసికట్టుగా పట్టణాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. హుస్నాబాద్ పట్టణంలో పెరుగుతున్న వాహనాల దృష్ట్యా ఔటర్ రింగ్ రోడ్ నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అక్కన్నపేట, రామవరం, నాగారం రోడ్‌లో సెంట్రల్ లైటింగ్, డివైడర్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని మంత్రిని కోరారు. మున్సిపాలిటీల్లో పారిశుధ్య సిబ్బంది వేతనాలు, విద్యుత్ వినియోగానికి ప్రతినెలా దాదాపు రూ.18 లక్షల వరకు ఖర్చు అవుతున్నాయని, వీటికి గతంలో పట్టణ ప్రగతి నిధులు ఖర్చు పెట్టామని చెప్పారు. మున్సిపాలిటీల్లో ప్రజలపై ఆర్థికభారం మోపకుండా ఆదుకోవాలన్నారు. పట్టణంలో ఇప్పటికే నర్సరీ, జిమ్, పార్కు, మున్సిపల్ నూతన భవనం, శ్మశానవాటికతోపాటు ఎన్నో అబివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అనంతరం మంత్రిని ఘనంగా సన్మానించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, కమిషనర్ ఎంఆర్ రాజశేఖర్, మేనేజర్ కృష్ణ, కౌన్సిలర్లు బోజు రమాదేవి, పెరుక భాగ్యారెడ్డి, జనగామ రత్నమాల, గోవిందు రవి, బొజ్జ హరీశ్, బొల్లి కల్పన, వాల సుప్రజ, కోమటి స్వర్ణలత, సరోజన, పున్న లావణ్య, చిత్తారి పద్మ, దొడ్డి శ్రీనివాస్, వల్లపు రాజు, మ్యాదరబోయిన శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు ఎండీ అయూబ్, కాశబోయిన లలిత, బొల్లం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.


యశోద దవాఖాన ఎదుట బీఆర్‌ఎస్ శ్రేణులు

## హైదరాబాద్‌కు తరలివెళ్లిన బీఆర్‌ఎస్ శ్రేణులు

సిద్దిపేట, డిసెంబర్ 12 : హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను చూసేందుకు సిద్దిపేట నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని నినాదాలు చేశారు. తరలివెళ్లిన వారిలో ఆయా గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రఘురామ్

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 12 : ఈనెల 30 జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్ పిలుపునిచ్చారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కోర్టు భవనంలో పోలీస్ ఉన్నతాధికారులు, న్యాయవాదులతో లోక్ అదాలత్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అనంతరం మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా లీగల్ అవేర్నెస్ క్యాంపు ఏర్పాటు చేశారు. మానవ హక్కులను అందరూ గౌరవించాలని, సమాజంలో ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా బతకాలని ఆయన సూచించారు. సమావేశంలో జడ్జిలు మురళీమోహన్, స్వాతిరెడ్డి, చందన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

## చేర్యాల అభివృద్ధికి చర్యలు

చేర్యాల, డిసెంబర్ 12 : మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యే క చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణీశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులతోపాటు త్వరలో చేపట్టనున్న పనులపై చర్చించారు. అనంతరం బోర్‌మోటర్ల మరమ్మతులు, పట్టణంలో చెత్త సేకరించే వాహనాల రిపేర్లు చేపట్టాలని కౌన్సిల్ తీర్మానించింది. సమావేశంలో కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్లు చెవిటి లింగం, మంగోలు చంటి, ఆడెపు నరేందర్, జుబేదాఖతూన్, ఉడుముల ఇన్నమ్మ, తుమ్మలపల్లి లీలా, తార, సురేశ్, సతీశ్‌గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు నాగేశ్వర్‌రావు, ఆరోగ్యరెడ్డి, మేనేజర్ ప్రభాకర్, ఏఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సంపత్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 12 : జనగామ జడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని మద్దూరు, ధూళిమిట్ట బీఆర్‌ఎస్ మండలాల అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ కోసం సంపత్‌రెడ్డి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరం గ్రామంలో ఏర్పాటు చేసిన పాగాల సంపత్‌రెడ్డి సంతాప సభకు బీఆర్‌ఎస్ శ్రేణులు హాజరై నివాళులర్పించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 12 : సిద్దిపేట పట్టణ, పరిసర ప్రాంత మహిళలకు కుట్టు మిషన్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రగతి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు వడ్డేపల్లి స్వరూపారాణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20 ఏండ్లుగా మహిళా ప్రగతికి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి కల్పించామన్నారు. 18 ఏండ్లు నిండినవారికి మరోసారి కుట్టు మిషన్‌లో నెల రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల మహిళలు ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్ ఫొటోలు తీసుకొని సంస్థ కార్యాలయంలో అందజేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9491995033 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రవి

సిద్దిపేట, డిసెంబర్ 12 : చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ అధ్యాపకులుగా పనిచేస్తున్న గొంటి రవిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

# శిక్షణ తరగతులు నిర్వహించాలి

## జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 12 : జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో మహిళలకు అన్నిరంగాల్లో శిక్షణ తరగతులు నిర్వహించాలని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని జడ్పీ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన 5వ(స్త్రీ, శిశు సంక్షేమం), 6వ(సాంఘిక సంక్షేమం), 7వ(పనులు), 1వ(ఆర్థిక, ప్రణాళిక) స్థాయీ సంఘం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన గ్రామ పంచాయతీల్లో మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో చదివే పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వారిలో పోషకాహార లోపంతో ఉండొద్దన్నారు. బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చలికాలంలో స్వెటర్స్ పంపిణీ చేయాలని సూచించారు. జిల్లా పరిషత్ ద్వారా జరిగే పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడా నీటి కొరత లేకుండా మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలని తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీలు రణం జ్యోతి, కవిత తిరుపతి, సిద్ధప్ప, మంగ, రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి


సిద్దిపేట టౌన్ : మాట్లాడుతున్న సీఐ రవికుమార్

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 12 : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ ఆకాంక్షించారు. మంగళవారం మందపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాల్య వివాహం చేసుకొని భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మనిషి జీవితాన్ని మార్చేది చదువు ఒక్కటేనని.. ఈ విషయాన్ని విద్యార్థులు గుర్తించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**చదువుతూనే లక్ష్యాన్ని చేరుకోవాలి..**

గజ్వేల్, డిసెంబర్ 12 : విద్యార్థులు చదువుతూనే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే తప్పకుండా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీఐ రంగ కృష్ణ సూచించారు. ప్రజ్ఞాపూర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు మానవ మనుగడకు చాలా అవసరమన్నారు. విద్యార్థులు ఒకరికొకరు చదువులో సహాయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. మానవ అక్రమ రవాణాపై సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**మూఢ నమ్మకాలను నమ్మొద్దు..**

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), డిసెంబర్ 12 : ప్రజలు మూఢ నమ్మకాలను నమ్మడంతో ఆరోగ్యంగా దెబ్బ తినడంతోపాటు ఆర్థికంగా ఇబ్బందులు కొని తెచ్చుకుంటున్నారని భూంపల్లి ఎస్సై భువనేశ్వర్ అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో కను విప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరాలతో ప్రజలు ప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లోకి వచ్చే దొంగ బాబాలను ఎవరూ నమ్మొద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బాలమల్లేశంగౌడ్, ఉపసర్పంచ్ రాజు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


గజ్వేల్ : మాట్లాడుతున్న సీఐ కృష్ణ

## మహిళలను ప్రోత్సహించాలి

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 12 : మహిళలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని జిల్లా మహిళా సాధికారత కో-ఆర్డినేటర్ గొల్లపల్లి వాసవి సూచించారు. మంగళవారం హుస్నాబాద్‌లో ముందడుగు ఆదర్శ మహిళా ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై రోజురోజుకూ నేరాలు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు మహిళలు సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో స్నేహిత కౌన్సిలింగ్ కేంద్రం కో-ఆర్డినేటర్ సుజాత, సాధికారత జెండర్ స్పెషలిస్టులు లావణ్య, పద్మ, సుభిక్ష అగ్రి ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ ఉమేశ్, ముందడుగు ఆదర్శ మహిళా ఫెడరేషన్ సీఆర్‌పీలు సునీత, అనూష, రమాదేవి, షీటీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధే లక్ష్యం

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 12 : గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పంచాయతీ పాలకవర్గ సభ్యులు పనిచేస్తున్నారని సర్పంచ్ గంగి భాగ్యలక్ష్మీశ్రీనివాస్ అన్నారు. మంగళవారం మద్దూరు మండలం వంగపల్లిలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న రెండు అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులకు నిధులు కేటాయించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీ కూరెళ్ల రాజుగౌడ్, పంచాయతీ కార్యదర్శి బాలనర్సింహ, ఉపసర్పంచ్ కొమిరె కేత, వార్డు సభ్యులు కూరెళ్ల రాజు, లింగని నర్సింగరావు, కూరెళ్ల శంకరయ్య, బొడికె సుగణమ్మ, బొడికె హెమాల్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడికి మహానంది పురస్కారం

చేర్యాల, డిసెంబర్ 12 : మండలంలోని నాగపురి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ ఎలికట్టె ఐలయ్యకు కాకతీయ మహానంది పురస్కారం లభించింది. 35 ఏండ్లుగా సాహిత్యంలోని టీవీ, రేడియో ప్రసారానికి ఏఎన్‌ఎస్ 24 టీవీ వారు పురస్కారాలు అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఐలయ్య రచించిన ఊయల పాటలు, ఉద్యమ గీతాలు, దేశభక్తి గేయాలు, బాలగేయాలు, చైతన్య గీతాలకు మహానంది పురస్కారం దక్కింది. తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ చింతపట్ల వెంకటాచారి, సీఈవో అశోక్‌కుమార్, నాగరాజు, ప్రముఖ రచయిత్రి వనపర్తి పద్మావతి చేతుల మీదుగా ఐలయ్య పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఐలయ్యను చేర్యాల రచయితల సంఘం అధ్యక్షుడు రామచంద్రమూర్తి, సభ్యులు అభినందించారు.